# మనసు మెరిస్తే..



కె. శ్రీకృష్ణ బహదూర్

వసంతం మనసంతా చిరాకుగా ఉంది.

వ్యక్తిత్వం లేని జీవితం వృథా అని చెప్పినా అర్థం చేసుకోని భర్త ప్రశాంత్ మీద కోపంగా ఉంది.

తన ప్రత్యేకత చిత్ర లేఖనం. దాన్ని ఏనాడో పెళ్ళికి ముందు నేర్చుకుని, శ్రద్ధగా ప్రాక్టీస్ చేసింది. పెళ్ళైన తర్వాత వదిలేసింది. దానికి కారణం ఒక్కటి కాదు.

మొదటి రెండేళ్ళు పెళ్ళైన కొత్తలో వేరే సరదాలన్నిటితో గడిచిపోయింది. తర్వాత పిల్లలు, రవి, సరోజ వరుసగా రెండేళ్లలో పుట్టారు.

ఉయ్యాలలో సరోజ, చేతుల్లో రవితో ఊపిరాడసంత సంతోషం, సరదా, సుఖంతో హాయిగా ఉంది.

ఆ తర్వాత అత్తమామలకి జబ్బులు కూడాబలుక్కున్నట్లు వచ్చేశాయి. ఇద్దర్నీ వేరే వేరే నర్సింగ్‌హోమ్‌లలో ఉంచి, అటూ ఇటూ పరుగులు తీసి, శ్రమ అనుకోకుండా సపర్యలు చేసి, బిజీగా కాలం గడపాల్సి వచ్చింది. ఆ పెద్దలు ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు రాలిపోయారు.

ఇంతలో పిల్లల్ని స్కూళ్ళలో చేర్చి, వాళ్ళని దింపడానికి, తీసుకురావడానికీ, వాళ్ళనీ, ఇంటి పనులూ, అన్నీ తనే చూసుకుంటూ పరుగులు తీయడానికి సమయం వచ్చేసింది.

భర్త ఆఫీసులో ప్రమోషన్ల కసం తంటాలు పడుతూ, పోటీగా పనిచెయ్యడం, ఆఫీసు పాలిటిక్స్‌లతోనూ బిజీగా ఉన్నాడు.

అతన్ని ఇంటి చికాకులతో విసిగించకుండా అన్ని పనులు చేస్తూ కాలం గడిపింది. అందుకు ఆమె బాధపడలేదు కూడా.

ఒక గృహిణికి ఎన్ని పనులుంటాయో!

తెలియని వాళ్ళు తేలికగా భావిస్తారు!

పనుల ఒత్తిడిలో అవే ముఖ్యమైన విషయాలుగా భావిస్తూ తన హాబీ సంగతి మర్చిపోయి ఏళ్ళు గడిపే

సింది వసంత. ఇప్పుడు పిల్లలు స్కూళ్లలో ఫస్ట్‌రేంక్‌లు తెచ్చుకుని కాలేజీల్లోకి సునాయాసంగా ప్రవేశించారు.

వసంతకి ఆనందంగానూ, గర్వంగానూ కూడా ఉంది. వాళ్ళ విజయం వెనుక తన హస్తం కూడా ఉంది మరి!

మునుపటిలా పిల్ల మీద తను శ్రద్ధ తీసుకునే అవసరం తీరిపోయింది.

ప్రశాంత్ ఆఫీసులో పెద్దపొజిషన్ అందుకున్నాడు. ఇంక పోటీలు లేక అతని మీద ప్రెషర్ తగ్గింది. దాంతో అతను పిల్లల చదువు మీద శ్రద్ధ చూపిస్తున్నాడు. అదో పెద్దపనికాదు. పిల్లలు బుద్ధిమంతులు. తమ ఫస్ట్ వచ్చే అలవాటు మానుకోలేదు!

వీటన్నిటి ఫలితంగా వసంత ఇప్పుడు తీరిగ్గా ఉంది. ఈ మధ్యే తన పాత స్నేహితురాలు సుగుణ ఒక డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో కనపడితే, తనే గుర్తుపట్టి పలకరించింది. సుగుణ ఆమెకి చిత్రలేఖనం క్లాసులో ఫ్రెండ్

"హాయ్ వసంత, ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి? ఎలా ఉన్నావు? ఎక్కడున్నావు? నీ భర్త ఎవరు? ఏంటి? ఎంతమంది పిల్లలు? నీ పెయింటింగ్ ఎలా ఉంది?" ప్రశ్నల వర్షం కురిపించింది సుగుణ.

ఆ వర్షపు జల్లుకి పులకించి తన సంగతులన్నీ సంతోషంగా చెప్పింది వసంత.

కుతూహలంగా వింది సుగుణ.

బావుంది వసంతా, ఒక హౌస్ వైఫ్‌గా ఉంటున్నావు. కానీ, నాకన్నా మంచి పెయింటింగ్స్ వేస్తావు నువ్వు. నీ చేతిలో ఉన్న విద్యని వదిలేసావు. అదేనాకు నచ్చలేదు. నీలో ఉన్న ప్రత్యేకత, గొప్పకళ చిత్రలేఖనం. దాన్ని సరిగ్గా ఉపయోగించి ఉంటే నీకో వ్యక్తిత్వం ఉండేది. ఇప్పటికీ మించిపోలేదు. మళ్ళీ ప్రారంభించు. నాకన్నా గొప్పపేరు తెచ్చుకుంటావు. నీ ఇండివిడ్యువాలిటీ ముద్ర నీ బొమ్మల్లో చూపు" అంది సుగుణ.

అప్పుడు సుగుణ గురించి వివరాలు అడిగింది వసంత.

సుగుణ చిత్రలేఖనం వసంతలాగే పూర్తిగా నేర్చుకుంది. పెళ్ళైన తర్వాత ఆమె తనకు తెలిసిన విద్యని వదిలేయలేదు. ఆమె భర్త కూడా ప్రోత్సాహపరిచాడు.

ఆమె వసంత అంత బాగా బొమ్మలు వెయ్యలేదు. కానీ, కొంత మంచి నేర్పుకలదే. ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి తన పేరు నలుగురికి తెలిసేలా చేసుకుంది.

ఆమె మరీ డబ్బు కోసమే బొమ్మలు వేయదు. అందుచేత కొన్ని పెయింటింగ్స్ ధరలు మధ్య తరగతి కుటుంబాలకి అందుబాటులో ఉండేలా ఉంచింది. అందువలన డిమాండ్ ఎక్కువై, శ్రీమంతులూ, ఇతరులూ కూడా బాగా కొంటున్నారు. "డబ్బూ, పేరూ వస్తూంటే బాగానే ఉంది వసంతా" అంది నవ్వుతూ.

"అయితే నేనూ చేసి చూస్తాను" అంది వసంత ఉత్సాహంగా.

ఓ"ఓ ఎస్, యూ మస్ట్ డూ ఇట్. ఎగ్జిబిషన్ మరి. నేను సహాయం చేస్తాను" అంది సుగుణ.

వసంత ఆనందంగా ఇంటికి వచ్చింది. ప్రశాంత్ ఆఫీసు నుండి రాగానే విసిగించకుండా, అతని మూడ్ చూసి చెప్పింది.

"ఆ, ఏం వద్దు వసంతా, డబ్బు దండుగ. వేలల్లో ఖర్చవుతుంది. ఏ నాటికో గాని తిరిగిరాదు. ఇప్పుడు నీకు పేరు ప్రఖ్యాతులు, ఇండివిడ్యుయాలిటీ అదే ఒక వ్యక్తిత్వం లేకపోతే కొంపమునిగిపోదు" అన్నాడు ప్రశాంత్ ఆమె ఆనందం ఎగిరిపోయేలా.

> "నాన్నగారూ! రెండు ప్రోగ్రామ్స్ కూడా చూశారు కదా! మరి నా డాన్స్ బావుందా? అన్నయ్య కరాటే ప్రదర్శన బావుందా?"
>
> "అనవసరంగా ఇద్దరినీ చెరో చోటకు పంపించానేమో అనిపిస్తోంది"
>
> "ఎందుకని?"
>
> "మరేం లేదు. నీ డాన్స్ ప్రదర్శన కరాటే ఫైటింగ్ లాగాను, అన్నయ్య కరాటే నీ డాన్స్ లాగాను ఉండే సరికి. . . ."

ఇద్దరూ రెండు గంటలు వాదించుకున్నారు. ఆమె ఎంత వాదించినా అతను ఒప్పుకోలేదు. ఇద్దరికీ పంతం ఎక్కువైంది. వసంత చదువుకున్నదీ, తెలివైనది. పంతం, పట్టుదలా ఉన్నా మూర్ఖత్వం లేదు. తన కోరిక తీరడం కోసం ఆమె పట్టుదలని పనులు చెయ్యకపోవడంలోనూ, పడక గదిలోకి తీసుకువెళ్లడం లోనూ చూపనే చూపలేదు.

అలా చేస్తే మగవాడి అహం దెబ్బతింటుంది. అలక అందంగానే ఉంటుంది కానీ, మూర్ఖత్వం విసిగిస్తుంది. విసుగెత్తిన మగవాడు వేరుదార్లు పట్టగలడని ఆమెకు తెలుసు. అందుకని అన్నీ చేస్తున్నా ముభావంగా ఉండసాగింది. ప్రశాంత్ రెండు రోజులు కేర్ చేయనట్లు ప్రవర్తించాడు. ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు.

ఈ ఆడవాళ్లు తమ పంతం నెగ్గడానికి ఎన్ని వేషాలైనా వేస్తారు. తన దగ్గర ఈ పప్పులుడకవు. తను ఎంత తెలివైనవాడు. ఎంత పట్టుదలతో పైకి వచ్చాడు! భార్య బిగుసుకుని కూర్చుంటే భయపడో, లొంగిపోయో తను ఆమె మాటలకి తాళం వేస్తాడా? నెవర్! ఆమెను ఎక్కడ ఎలా ఉంచాలో తనకు బాగా తెలుసు. హూఁ! అనుకున్నాడు ప్రశాంత్. తన అహాన్ని రెచ్చగొట్టుకుని బింకంగా ఉన్నాడు.

తల్లిదండ్రుల మధ్య కోల్డ్ వార్ పిల్లలకు అర్థమవసాగింది. వాళ్లకి సానుభూతి తల్లిమీదే ఉంది. అందుకని తండ్రికి నచ్చచెప్పాలనుకున్నారు.

సరోజ తండ్రికి ముద్దు. రవి తల్లికి గారాల బిడ్డ. సరోజ చెబితే తండ్రి బాగా వినొచ్చు అనుకున్నారు ఆ అన్నాచెల్లెలు.

"నాన్నా! మీరిప్పుడు మేనేజర్ అయ్యారు కదా? పెద్ద పెద్ద పరిచయాలు కలుగుతాయి. అవునా, కాదా?" అంది సరోజ.

ప్రశాంత్ తెలివైనవాడు. కూతురు ఎటువైపు సంభాషణ తీసుకెళ్లబోతోందో గ్రహించాడు.

"అయితే ఏమిటి?" అన్నాడు విసుగ్గా.

"మీ గొప్పదనమే కాకుండా మీ ఇంట్లో అందరికి గొప్పతనం ఉంది. అంటే మీ ఫ్యామిలీ గ్రేట్ అని పేరు వస్తుంది కదూ నాన్నా!"

ఈ పేరు గొప్పకోసం నేను ప్రాకులాడట్లేదు."

"నాన్నా! నేనూ, అన్నా అన్నిట్లో ఫస్ట్ వస్తున్నది ఎందుకంటారు?"

"మీరు తెలివిగా ఉన్నారు. బాగా చదువుకుంటున్నారు. మా కంట్రోల్లో ఉన్నారు. అందుచేత ఫస్ట్ వస్తున్నారు."

"మరి అమ్మ కూడా తెలివైనది, బాగా బొమ్మలు వేస్తుంది. మీ కంట్రోల్లోనే ఉంది కదా! అమ్మ కూడా ఫస్ట్‌క్లాస్ ఆర్టిస్టు అవుతుంది. ఎందుకండీ ఎంకరేజ్ చెయ్యరు? మీకు స్వార్థం లేదు. ఎందుకు నాన్న ఇలా అమ్మ ఆశల్ని చంపేస్తున్నారు" అంది సరోజ.

"చూడు సరోజా! నువ్వు పెద్దదానివి అవుతున్నావు. కొన్ని విషయాలు చెప్పకుండానే అర్థం చేసుకోవాలి. మీ అమ్మ నీకు తల్లే కావచ్చు. కానీ నాకు భార్య కూడా. నాకు నచ్చనప్పుడు ఊరుకోవాల్సిందే. మగపెత్తనం అని దానికో పేరు తగిలించి బాధపడడం, నన్ను విసిగించడం మంచిదికాదు. నాకూ మంచీ చెడూ తెలుసు. ముందు చూపుతోనే వద్దంటున్నాను. ఇంక ఈ ప్రసక్తి ఎవ్వరూ తీసుకురాకండి. నాకు కోపం తెప్పిస్తున్నారు" అన్నాడు ప్రశాంత్.

"అయితే నేను మీ భార్యగానే పేరు పొందాలన్న మాట. మీరు నా భర్త అంటే మాత్రం భరించలేరా? ఇదేనా మీ సమస్య? నా వ్యక్తిత్వం మీద మీ పేరు ప్రతిష్ఠలు ఆధారపడకూడదు అంతేకదా! నాకు వ్యక్తిత్వం లేని జీవితం వృథా అనిపిస్తోంది. అది మీకు తెలిసినా ఒప్పుకోరు. ఛ, ఇది మూర్ఖత్వం!" అంది వసంత విసుగుతో.

"వాదించడం, నన్ను మూర్ఖుడనడం ఇవన్నీ ఏం బాగాలేదు. నువ్వు మూర్ఖంగా మాట్లాడుతున్నావు. ఇంక తిట్టుకోడాలు, అసహ్యంగా ప్రవర్తించడం జరిగిందంటే బ్రతుకు రోతగా ఉంటుంది. లేనిపోని గొడవ ప్రారంభిస్తున్నావు. తెగేదాకా తాడు లాగకు, వసంతా!" కోపంగా అన్నాడు ప్రశాంత్.

అందరూ మౌనంగా ఉండిపోయారు.

సరోజ చిరాగ్గా వెళ్లిపోయింది. వసంత ఒక నిట్టూర్పుతో వంటగదిలోకి వెళ్లింది.

ప్రశాంత్ గర్వంగా నవ్వుకున్నాడు.

★ ★ ★

"సార్, మీ కోసం ఎవరో వచ్చారు. ఇదిగో విజిటింగ్ కార్డ్ ఇచ్చారు." ప్యూన్ ప్రశాంత్ చేతికో కార్డ్ ఇస్తూ చెప్పాడు.

ఆఫీసులో ఫైల్ చూస్తున్న ప్రశాంత్ అందుకుని చూశాడా కార్డును.

రవికిరణ్!

ఏనాటి రవికిరణ్! తన బాల్య మిత్రుడు, బెస్ట్ ఫ్రెండ్! పాతికేళ్ల ముందు వేరే ఊరికి వెళ్లిపోయి కాంటాక్ట్ లేకుండా పోయింది. ఇప్పుడొచ్చాడా ఓహ్!

"రమ్మని చెప్పు" అన్నాడు ప్యూన్‌తో.

రవికిరణ్ ఆ ఆఫీస్‌లోకి వచ్చాడు. అతన్ని చూసి ప్రశాంత్ నవ్వుతూ చెయ్యూపాడు. రవికిరణ్ తన స్నేహితుడిని పోల్చుకున్నాడు. వెంటనే నవ్వుతూ అతని టేబుల్ దగ్గరకు వచ్చాడు. ఇద్దరూ పలకరించుకుని షేక్‌హాండ్ చేశారు.

"ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి! ఎక్కడున్నావు? ఏం చేస్తున్నావు? నేనిక్కడ ఉన్నానని ఎలా తెలిసింది? ఏమైనా తీసుకుంటావా?" ప్రశ్నలు వరసగా వేశాడు ప్రశాంత్ ఫ్రెండ్‌ని తన ఎదురుగా కూర్చోబెడుతూ.

"నీ ప్రశ్నలకు వెనుకనుంచి జవాబు చెప్తాను. ఎండలో వచ్చాను. కూల్‌డ్రింక్ తీసుకుంటాను. నువ్విక్కడ ఉన్నావని నా భార్య సుగుణ చెప్పింది. ఆవిడకు నీ

భార్య మంచి స్నేహితురాలు. వాళ్లిద్దరూ ఈమధ్యే కలిశారు. మాటల్లో తమ భర్తల గురించి చెప్పుకున్నారు. అప్పుడే నిన్ను గుర్తు పట్టేశాను. నేనొక కంపెనీలో చీఫ్ అకౌంటెంట్‌ని. నా అడ్రస్ విజిటింగ్ కార్డులో ఉందిగా. మనం మీటయ్యి రెండున్నర దశాబ్దాలయ్యింది'' అన్నాడు రవికిరణ్ నవ్వుతూ.

ప్రశాంత్ నవ్వాడు. ప్యూన్‌ని పిలిచి ఫ్రెండ్‌కి కూల్ డ్రింక్ తెప్పించాడు. ఇద్దరూ ఒక పావుగంట కబుర్లు చెప్పుకున్నారు. ప్రశాంత్ మాట్లాడుతూనే మధ్యలో ఫైల్స్ చూస్తున్నాడు. కొంతసేపటికి రవికిరణ్ వెళ్లడానికి సిద్ధమయ్యాడు.

''ప్రశాంత్! నిన్ను చూడడంతో పాటు ఈ ఇన్విటేషన్ కార్డు ఇద్దామని కూడా వచ్చాను, ఇదిగో!'' అన్నాడు రవికిరణ్.

''ఏమిటిది''

''నా భార్య సుగుణ పెయింటింగ్ చేస్తుంది. వాటిని ఎగ్జిబిషన్‌లో పెడుతుంది. అలాగే ఈసారీ ఎగ్జిబిషన్ ఉంది రేపు సాయంత్రం. వాళ్లిద్దరూ ఫ్రెండ్స్ కదా! నీ భార్యని కూడా తీసుకురా. ఏదో సాకు చెప్పి మానేయకు.'' అన్నాడు రవికిరణ్ చిరునవ్వుతో.

''సరేరా, నా పిల్లల్ని కూడా తీసుకువస్తాను'' అన్నాడు ప్రశాంత్ లేస్తూ. ఇద్దరూ ఇంకోసారి కరచాలనం చేసుకున్నారు. రవికిరణ్ వెళ్లిపోయాడు.

పెయింటింగ్స్ ఎగ్జిబిషన్‌కి ప్రశాంత్ ఫ్యామిలీ అందరూ వెళ్ళారు. సాయంత్రం కావడం వలన అందరికీ వెళ్ళడానికి వీలయ్యింది. ఆ ఎగ్జిబిషన్ ప్రారంభానికి ప్రముఖ సినీ హీరో జయంత్ వచ్చాడు. ''కళలని ప్రోత్సహించాలి, అజ్ఞాతంగా ఉండే టేలెంట్స్‌ని బయటకి తీసుకు రావాలి, ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలోని కళాత్మక హృదయాలని, కళాకారులని సంతోషపరచాలని, అలా చేస్తే ఆ సున్నిత మైన మనసు కల వ్యక్తులు తమ శక్తిని ఇంకా బాగా చూపించగలరు'' అన్నాడు జయంత్.

తమ కుటుంబంలోని కళాకారులని పైకి తీసుకురావడం వలన సంఘానికే ఉపయోగ పడేలా ఒక మంచి పని చేశామనే తృప్తి ఉంటుంది, అని జయంత్ చెప్పగానే అందరూ చప్పట్లు కొట్టారు.

''కళాకారులకి కూడా బాధ్యత ఉంది. వాళ్ళెప్పుడూ తమ శాయశక్తులా ప్రయత్నించి మంచి రిజల్ట్స్ చూపించాలి. వాళ్ళకి మాత్రం చేసినది చాలు అనే తృప్తి ఉండకూడదు'' అని ఆ హీరో అనగానే తిరిగి ఆ హాల్లో కరతాళధ్వనులు మారు మ్రోగాయి. ''శ్రీమతి సుగుణగారు, శ్రీ రవికిరణ్ గారు ఇలా చాలా ఎగ్జిబిషన్స్ ఏర్పాటుచేసి, ఇంకా మంచి చిత్రాలని ప్రజలకి అందించాలని మనసారా కోరుకుంటున్నాను'' అన్నాడు హీరో జయంత్ ముగింపుగా. తర్వాత ఎగ్జిబిషన్‌లో బొమ్మలు చూశాడతను. అతనితో బాటు వెంట వెంట తిరిగారు సుగుణ, రవికిరణ్. ఆ హీరో వెళ్ళేదాకా ప్రశాంత్ దగ్గరకి రాలేకపోయారు వాళ్ళు.

ప్రశాంత్ మీద హీరో జయంత్ మాటలు పని చేయసాగాయి. చూస్తుండగా ఆ ఎగ్జిబిషన్ లోని పెయింటింగ్స్ అమ్ముడు పోసాగాయి. ఆబేరాల్లో రవికిరణ్ బాగా బిజీగా ఉన్నాడు. సుగుణ, వసంత ఏవో కలర్ కాంబినేషన్స్ గురించి చర్చించుకుంటున్నారు. ఆ పెయింటింగ్స్ చూస్తున్నారు. బాగా రాత్రయ్యాక ఆనాటికి ఎగ్జిబిషన్ ముగిసింది.

> '' వచ్చే నెలలో చిత్రం విడుదల అవుతుంది. అందులోని బూతుసీన్లో నా నటనకు మంచి గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నాను'' అంది సూపర్ హీరోయిన్.
>
> ''అదేమిటి? సెక్స్ పాత్రలు వెయ్యను'' అని స్టేట్‌మెంట్ ఇచ్చారుగా? మళ్ళీ . . . '' అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చారు సినీ జర్నలిస్టులు.
>
> అవును. అదే మాట మీద ఇప్పటికీ నిలబడి ఉన్నాను. ఇక్కడ బూతు సీను అంటే టెలిఫోన్ బూత్‌లో భయవిహ్వల ఫోన్ మాట్లాడే సీన్ అందులో చాలా సహజంగా నటించాను'' వివరించింది సూపర్ హీరోయిన్.

''సారీ ప్రశాంత్, అస్సలు తీరికే లేకపోయింది. నీతో కలసి ఉండలేకపోయాను'' అన్నాడు రవికిరణ్ రాత్రి వీడ్కోలు చెప్తూ.

''పది వేలు ఖర్చు పెట్టామే... ఇవ్వాళ్టికే ముప్ఫైవేలు వచ్చింది.'' అంటోంది సుగుణ వసంతతో.

''మనం మళ్ళీ మీటవుదాం రవీ'' అన్నాడు ప్రశాంత్.

''ఇవ్వాళ శుక్రవారం. ఆదివారం సుగుణ తమ్ముడు ఇక్కడుంటాడు. నేను ఇంట్లోనే ఉంటాను. ఆదివారం మా ఇంటికి వచ్చేయ్'' అన్నాడు రవి కిరణ్.

ప్రశాంత్ అంగీకారంగా తల ఊపాడు. ఆ ఫేమిలీ తమ ఇంటికి బయల్దేరారు.

''ఆల్‌రైట్ వసంతా, హీరో జయంత్ చెప్పిన మాటలతో నాకు తెలిసొచ్చింది. అంతే కాదు ఈ పెయింటింగ్స్‌లో ఇంత పేరూ, డబ్బూ ఉన్నాయని నాకు తెలీదు. నాకు డబ్బేం చేదు కాదు. నామనసు మారింది. నువ్వు పెయింటింగ్స్ వెయ్యి. మనం కూడా ఇలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేద్దాం. ఏమవుతుందో చూద్దాం'' అన్నాడు ప్రశాంత్ ఇంటికి రాగానే.

''అలాగేనండి'' అంది వసంత నవ్వుతూ.

★ ★ ★ ★ ★

ఆదివారం తన మిత్రుడి ఇంటికి వెళ్ళాడు ప్రశాంత్. సుగుణ, రవి కిరణ్ అతన్ని ఎంతో అభిమానంగా చూసి మాట్లాడారు.

''రవీ, మొన్న జయంత్ చెప్పిన మాటలు నాకళ్ళు తెరిపించాయి. అంతేకాక మీకొచ్చిన పేరు, డబ్బూ చూసి రవ్వంత అసూయ కూడా కలిగిందనుకో. నా భార్య మంచి ఆర్టిస్టు. ఆమెను ప్రోత్సహించాలనుకుంటున్నాను'' అన్నాడు ప్రశాంత్. అతని మాటల్లో నిజాయతీకి ఆ భార్యాభర్తలిద్దరూ నవ్వేశారు.

''అసూయ మంచి గుణం కాదనుకో, కానీ, దాన్నిసరిగ్గా ఉపయోగించుకుంటే బాగుపడగలం. అసూయ పడి మమ్మల్ని నాశనం చెయ్యాలని చూస్తే నువ్వే చెడిపోవచ్చు. అలా కాకుండా మమ్మల్ని మించి పోవాలని కృషి చేస్తే, ఒక ఆరోగ్య కరమైన పోటీ ఏర్పడుతుంది. అందు వలన అందరూ రాణిస్తారు. మన మధ్య ద్వేషాలు లేవు. మనం మంచి స్నేహితులం. మేము మీ ఉన్నతి కోరేవాళ్ళం. నీ భార్యని ప్రోత్సహించడంలో నీకు ఏ సహాయం కావాలన్నా చెప్పు మేం చేసి పెడతాం'' అన్నాడు రవికిరణ్ నవ్వుతూ.

ప్రశాంత్ ఒక్కక్షణం సిగ్గు పడ్డాడు. తన స్నేహితుడి మంచితనానికి అతని హృదయం స్పందించింది.

''ఏం లేదు రవీ, ఈ ఎగ్జిబిషన్, అమ్మకాలు నువ్వు చూసుకోవాలి. నాకు చేత కావు. నువ్వు ఊరికే చేస్తానంటే మాత్రం నే నొప్పుకోను. అమ్మకాల్లో కమిషన్ తీసుకోవాలి'' అన్నాడు.

ఓ''ఓ యస్. సిరిరా మోకాలొడ్డే వాడిని కాదు నేను. అలాగే కానీయ్'' అన్నాడు రవికిరణ్ సంతోషంగా.

★ ★ ★

ఆరు నెలలు గడిచాయి.

ఆ కొద్ది కాలంలోనే వసంత ప్రముఖ చిత్రకారిణి అయిపోయింది. విదేశీయులు కూడా ఆమె చిత్రాలు కొంటున్నారు. ఆమె చిత్రాలు బాగా అమ్ముడు పోతున్నాయి. పేరూ, డబ్బూ విపరీతంగా వచ్చాయి. అది ఆమె ఇరవై అయిదవ ఎగ్జిబిషన్.

దాన్ని ఆవిష్కరించడానికి ప్రముఖ హీరో జయంత్ వచ్చాడు. ''నేనీ మధ్య రెండు నెలల్లో శ్రీమతి వసంత గారి చిత్రాలు ఇరవై నాలుగు కొన్నాను. బహుశ, ఈ ఇరవై అయిదవ ఎగ్జిబిషన్‌లో ఇరవై అయిదవ చిత్రం కొంటాను కాబోలు'' అన్నాడు జయంత్ నవ్వుతూ.

విజిటర్స్ అందరూ చప్పట్లు కొట్టారు.

జయంత్ తిరిగి మాట్లాడాడు.

''శ్రీమతి వసంతగారు అద్భుతమైన టేలెంట్స్ కల మహిళ కొద్దికాలం లోనే ఇంతపైకి వచ్చిన ఆమెకు నా అభినందనలు. ప్రతి ఆర్టిస్టుకీ, రచయితకి,కవికి వాళ్ళింట్లోనే ముందు ప్రోత్సాహం ఉండాలి. కుటుంబ సభ్యులు ప్రోత్సాహమిస్తే ఆ కళాకారులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు. ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ హస్తం ఉంటుందంటారు. ఒక స్త్రీ విజయానికి ఎవరున్నా లేకపోయినా భర్తహస్తం ఉంటే మాత్రం ఆమె ఉన్నత శిఖరాలని అధిరోహించటమే కాదు, ఆకాశంలో ధృవతారగా మారిపోగలదు. ఈనాడు శ్రీమతి వసంతగారు తమకే కాక మనదేశానికే పేరు తెచ్చేలా ఎదిగిపోయారు. ఆమెకింతటి ఖ్యాతి కలగడానికి కారణం ఆమె భర్త శ్రీ ప్రశాంత్‌గారే నని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. భార్యని ఒక వ్యక్తిగా గౌరవించి,ఆమెకు ఒక వ్యక్తిత్వం ఉందని గ్రహించి దాన్ని పైకి తీసుకువచ్చి, ఆమె లోని టాలెంట్స్‌ని పదిమందికి ఉపయోగ పడేలా చేసే భర్త ఉత్తముడు, విశిష్ట వ్యక్తిత్వం కలవాడు, అందరికీ ఆదర్శప్రాయుడు అటువంటి భర్తని పొందిన భార్య తన ఖ్యాతికి గర్వించకుండా, భర్తమీద గౌరవం చూపిస్తే ఆమె సంస్కార వంతురాలు. శ్రీ ప్రశాంత్ దంపతులు అటువంటి భార్యా భర్తలు. వారి లాగ ఇతరులూ ఉండాలని నేనుకోరుకుంటున్నాను. ముఖ్యంగా శ్రీ ప్రశాంత్‌గారికి నా అభినందనలు తెలుపుతున్నాను'' అన్నాడు జయంత్. తనతో తీసుకువచ్చిన చమ్కీదండను ప్రశాంత్ మెడలో వేశాడు. ఆ హాల్లో కరతాళ ధ్వనులు మారుమ్రోగాయి.

రవికిరణ్, సుగుణ వసంత ప్రశాంత్ వైపు అభిమానంతో నవ్వుతూ చూస్తున్నారు.

కుళ్ళు బుద్ధులువదుల్చుకుని, మనసు మంచిగా మార్చుకుని, స్వంత వాళ్ళకైనా,పరాయివాళ్ళకైనా, అహం లేకుండా, అసూయ పడకుండా, అందరికీ తెలిసేలా, మనస్ఫూర్తిగా సహాయపడితే, అది తప్పకుండా మనకే మేలు చేస్తుందీ?

ముందు మనసు మెరిస్తే, మనిషీ మెరుస్తాడు? అనుకున్నాడు. ప్రశాంత్ అందరివైపూ ఆనందంగా చూస్తూ.